సాక్షి
పల్నాడు
మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



**ఐజీని కలిసిన ఎస్పీ ఆరిఫ్**

నగరంపాలెం: రేంజ్ ఐజీగా బాధ్యతలు స్వీకరించిన జి.పాలరాజును సోమవారం జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.




**నిమ్మకాయల ధరలు**

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.6000, మోడల్ ధర రూ.5000 వరకు పలికింది.

**కరోనా జీరో**

గుంటూరుమెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.





| | ఇఫ్తార్ (మంగళ) | సహర్ (బుధ) |
|---|---|---|
| నరసరావుపేట | 6:30 | 4:29 |
| గుంటూరు | 6:28 | 4:32 |
| బాపట్ల | 6:28 | 4:32 |

**రంజాన్ వేళలు**

## న్యూస్‌రీల్

### 20 నుంచి అమర్‌నాథ్ యాత్రికులకు వైద్య పరీక్షలు

గుంటూరుమెడికల్: అమర్‌నాథ్ యాత్రికులకు ఈనెల 20 నుంచి గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య పరీక్షలు వారంలో ప్రతి మంగళవారం, గురువారం మాత్రమే చేస్తారన్నారు. యాత్ర కు వెళ్లే ప్రతి ఒక్కరూ తమతోపాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, రెండు మెడికల్ సర్టిఫికెట్ నమూనాలు, వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తీసుకుని ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల మధ్యలో రావాలని ఆసుపత్రికి రావాలన్నారు. ఇతర వివరాల కోసం 9985404974 ఫోన్ లో సమాచారం పొందవచ్చు.

### సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 525.60 అడుగుల వద్ద ఉంది. ఇది 159.6858 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 5,292, ఎడమకాలువకు 5,018, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 12,110 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 12,110 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.70 అడుగుల వద్ద ఉంది. ఇది 31.3963 టీఎంసీలకు సమానం.

### యార్డుకు 1,50,569 బస్తాలు రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. ఈ సీజన్‌లో ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా సోమవారం రైతులు 1,50,569 బస్తాలు యార్డుకు తరలించారు. ఈ–నామ్ ద్వారా 1,40,783 బస్తాలు విక్రయాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 98,276 బస్తాలు నిల్వ ఉన్నాయి. ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. దీంతో రైతులు విక్రయాలకు మొగ్గు చూపుతున్నారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించినట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

# భద్రత .. భరోసా

- గుంటూరు, పల్నాడు జిల్లాలకు 79 బహుళ ప్రయోజన కేంద్రాలు మంజూరు
- రూ.31.60 కోట్లతో పనులు
- 46 గోడౌన్ల పనులు పూర్తి.. వివిధ దశల్లో మిగిలిన పనులు
- ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

**రైతులు నిశ్చింతగా పంటలు దాచుకోవచ్చు.. ఆరబెట్టుకోవచ్చు.. అమ్ముకోవచ్చు..**



అనంతవరప్పాడులో పూర్తయిన మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ పనులు

సాక్షి ప్రతినిధి గుంటూరు: ఎండనక, వాననక ఆరుగాలం శ్రమించే రైతన్నకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్బీకేలు ఏర్పాటు చేసి విత్తు నుంచి దిగుబడి వరకు కావాల్సిన అన్ని రకాల సేవలను అందిస్తోంది. దీంతోపాటు పెట్టుబడి సాయం కింద ప్రతి ఏటా రైతు భరోసా కింద రైతు ఖాతాలకు నగదును జమ చేస్తోంది. వీటితోపాటు రైతులు పండించిన పంట దిగుబడులను గిట్టుబాటు ధర వచ్చేవరకు భద్రంగా దాచుకునేందుకు వీలుగా మల్టీ పర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్లను నిర్మించి రైతులకు అండగా నిలుస్తోంది. మల్టీపర్పస్ ఫెసిలిటీ కేంద్రాలతో రైతులు నిశ్చింతగా పంటలను గోడౌన్లలో భద్రపరచుకుని గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునేందుకు వీలవుతుంది. ఒక్కో సెంటర్ రూ.40 లక్షల పెట్టుబడితో 500 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు నిల్వ చేసుకుందుకు వీలుగా రూ.31.60 కోట్లతో 39,500 మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ప్రభుత్వ నిర్మిస్తోంది.

**ఆర్బీకేల పరిధిలో..**

గుంటూరు, పల్నాడు జిల్లాలకు 79 మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి నిర్మాణానికి సంబంధించిన పనులను ప్రారంభించారు. వీటిని రైతు భరోసా కేంద్రాల పరిధిలో సహకార సంఘాల ఆధ్వర్యంలో మార్కెటింగ్‌శాఖ అధికారులు నిర్మిస్తున్నారు.

**ఎక్కడెక్కడ నిర్మిస్తున్నారంటే..**

గుంటూరు జిల్లాలోని గుండ్లపాడు, పెనుములి, పెదపాలెం, కాజ, వడ్డేశ్వరం, కొలకలూరు, బుర్రిపాలెం, వల్లభాపురం, దావులూరు, కొల్లిపర, వెల్లలూరు, రేటూరు, కె.బి.పాలెం, చినలింగాయపాలెం, కారంపూడిపాడు, పుసులూరు, జొన్నలగడ్డ, వేములూరిపాడు, మేడికొండూరు, సిరిపురం, ఈమని, పెదరావూరు, తాళ్ళపాలెం, ఉప్పరపాలెం, కసుమర్రు, నండూరు, సుద్దపల్లి, పెదకాకాని, అనంతవరప్పాడులలో నిర్మిస్తున్నారు. ఇందులో గుండ్లపాడు, పెదపాలెం, కాజ, కొలకలూరు, బుర్రిపాలెం, దావులూరు, కొల్లిపర, ఈమని, ఉప్పరపాలెం, పెదకాకాని, అనంతవరప్పాడులలో గోడౌన్ల నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. వల్లభాపురం, వెల్లలూరు, పుసులూరు, సిరిపురం, తాళ్లపాలెం,కసుమర్రు, సుద్దపల్లిలలో బేస్‌మట్టం దశలో ఉన్నాయి. జొన్నలగడ్డ, వేములూరిపాడు, మేడికొండూరులలో నిర్మించే గోడౌన్ల పనులు ప్లాస్టింగ్ దశలో ఉన్నాయి. మిగతా గోడౌన్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే పల్నాడు జిల్లాకు 50 మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 28 పూర్తయ్యాయి.

| | |
|---|---|
| రెండు జిల్లాల్లో మంజూరైన మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు | : 79 |
| ఒక్కో దానికి మంజూరైన నిధులు: | 40 లక్షలు |
| మంజూరైన మొత్తం నిధులు | : రూ.31.60 కోట్లు |
| ఒక్కో గోడౌన్ సామర్థ్యం | : 500 మెట్రిక్ టన్నులు |
| ఇప్పటివరకు పనులు పూర్తయినవి | : 46 |
| వివిధ దశల్లో పనులు జరుగుతున్న గోడౌన్లు | : 33 |

**శరవేగంగా పనులు..**

మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ పనులు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో ఇందులో 46 గోడౌన్‌ల పనులు పూర్తి కాగా, మిగతావి వివిధ స్థాయిల నుంచి ప్లాస్టింగ్ దశకు వచ్చాయి. సంబంధిత పనులన్నింటినీ త్వరితగతిన ఏప్రిల్ మాసం చివరి నాటికి పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. పనులు పూర్తయిన వెంటనే వాటిని సహకార సంఘాలకు అప్పగించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తారు.

– ఐ.నారాయణ, మార్కెటింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

**ఏయే వసతులుంటాయంటే...**

ఈ మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్‌లలో రైతులు పండించిన పంటలను ఆరబెట్టుకొనేందుకు వీలుగా ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తారు. అలాగే రైతు పండించిన పంట ఉత్పత్తులను తెచ్చి అమ్ముకోవచ్చు. అలా కాకుండా తమ పంటలకు గిట్టుబాటు ధర వచ్చే వరకు ఇక్కడే భద్రపరచుకోవచ్చు.

**రెండో దశలో 54 మంజూరు...**

గుంటూరు, పల్నాడు జిల్లాలకు రెండవ దశలో 54 సెంటర్లు మంజూరయ్యాయి. వీటిలో గుంటూరు జిల్లాకు 20, పల్నాడు జిల్లాకు 34 ఉన్నాయి. వీటికి మరో వారం రోజుల్లో టెండర్లు పిలవనున్నట్లు మార్కెటింగ్‌శాఖ అధికారులు చెప్పారు.

# రేపటి నుంచి ‘స్పాట్’!

- పదోతరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనానికి సర్వం సిద్ధం
- తొలిసారిగా నరసరావుపేటలో కేంద్రం ఏర్పాటు
- 2.01 లక్షల జవాబు పత్రాలు పరిశీలన
- విధులకు 1,500 మంది ఉపాధ్యాయులు
- ఈ నెల 26తో ముగియనున్న ప్రక్రియ



పదోతరగతి పరీక్షల మూల్యాంకనం జరగనున్న సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్

సాక్షి, నరసరావుపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జవాబు పత్రాల మూల్యాంకన (స్పాట్ వాల్యూయేషన్) ప్రక్రియ రేపటి నుంచి ప్రారంభం కానుంది. పల్నాడు జిల్లా పరిధిలో నరసరావుపేట పట్టణంలోని సెయింటాన్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగనుంది. కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత వాటి ప్రాతిపదికన తొలిసారి నరసరావుపేటలో మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. మూల్యాంకనంలో పాల్గొనేందుకు అవసరమైన ఉపాధ్యాయులకు ఇప్పటికే నియామక ఉత్తర్వులు అందజేశారు. వివిధ జిల్లాల నుంచి సుమారు 2.01 లక్షల జవాబు పత్రాలు పల్నాడులో మూల్యాంకనం చేయనున్నారు. ఆ సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులకు విధులు వేశారు. వివిధ కేటగిరీల వారీగా సుమారు 1,500 మంది ఉపాధ్యాయులు అవసరమని గుర్తించారు. ఏదైనా ఇబ్బంది వల్ల కొంతమంది రాలేకపోయినా మూల్యాంకనానికి ఇబ్బంది లేకుండా అదనంగా ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు. మూడు దశల్లో పకడ్బందీగా మూల్యాంకనం జరిపిన తరువాత మార్కుల వివరాలను ఎస్ఎస్‌సీ బోర్డుకు పంపనున్నారు. అసిస్టెంట్ ఎగ్జామినర్లు ఒక్కొక్కరు రోజుకు 40 పేపర్లు దిద్దనున్నారు. పరీక్ష రాసిన విద్యార్థులకు ఏ దశలోనూ నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

**పక్కాగా నిబంధనలు అమలు...**

పదోతరగతి మూల్యాంకనంలో పాల్గొనే సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డుల జారీచేయనున్నారు. గుర్తింపు కార్డు ఉన్నవారినే ఆ ప్రాంతంలోకి అనుమంతించనున్నారు. మూల్యాంకనం జరుగుతున్న అన్ని రోజులు అటువైపు ఇతరులు రాకుండా ఆంక్షలు విధిస్తున్నారు. విధుల్లో పాల్గొనే సిబ్బంది సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను వెంట తీసుకువెళ్లడానికి లేదు. విధులకు నియమించిన ఉపాధ్యాయులు ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాల్యూయేషన్ కేంద్రంలో ఉండాల్సి ఉంది. మధ్యాహ్నం భోజనానికి సైతం బయటకు వెళ్లనివ్వరు. ఉపాధ్యాయులు వచ్చేటప్పుడు తమ వెంట భోజనాన్ని వెంట తెచ్చుకోవాలి, అవసరమైన వారికి ప్రాంగణంలోనే ప్రత్యేకంగా క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సిబ్బందికి అవసరమైన ఫర్నీచర్, టాయిలెట్లు, ఫ్యాన్లు, లైట్లు, కూలింగ్ మినరల్ వాటర్ సదుపాయాన్ని కల్పించారు.

**ఏర్పాట్లు పూర్తి...**



పదో తరగతి పరీక్షల మూల్యాంకనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఫర్నీచర్, ఫ్యాన్లు, లైట్లు, క్యాంటీన్, తాగునీరు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనలను పక్కాగా అమలు చేయనున్నాం. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అవసరమైన చర్యలు తీసుకున్నాం. సుమారు 1,500 మంది సిబ్బంది ఈ మూల్యాంకనంలో పాల్గొననున్నారు.

– శ్యాముల్, డీఈఓ, పల్నాడు జిల్లా

# సమస్యలపై మానవత్వంతో స్పందించాలి

- జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్
- స్పందనలో 186 అర్జీలు స్వీకరణ



స్పందనలో జిల్లా కలెక్టర్‌కు సమస్యలు చెబుతున్న బాధితులు

నరసరావుపేట: ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతీ ఒక్క జిల్లా అధికారి నిబంధనల ప్రకారం మానవత్వంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో నిర్వహించిన స్పందనకు అధ్యక్షత వహించి జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, పులిచింతల ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ వసంతబాబుతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే 186 ఫిర్యాదులను స్వీకరించారు. తొలుత జిల్లా అధికారులతో కలిసి పరిపాలన అంశాలపై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్, కలెక్టర్ శివశంకర్ ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గుంటూరు ఇంటెగ్రిటీ కన్సల్టెన్సీకి చెందిన గోనుగుంట్ల వెంకట్ స్పందన కార్యక్రమానికి వచ్చిన సుమారు 300 మందికి భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు బత్తుల మురళీ, గెల్లి వీరారెడ్డి, రావికింద సుబ్బారావు, రెడ్‌క్రాస్ కో–ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**పబ్లిక్ పార్కును పార్కుగానే ఉంచాలి..**

మా గ్రామంలో దాతలు 60ఏళ్ల క్రితం ధర్మసత్రాన్ని దానం చేశారు. నిర్వాహణకు 1.5ఎకరాల భూమిని కూడా ఇచ్చాడు. 60ఏళ్ల నుంచి గ్రామ ప్రజలేగాక వచ్చిపోయే బాటసారులు దానిలో సేదతీరేవారు. 2005లో దానిని గ్రామంలోని కొందరు కూల్చేసి వాణిజ్య కాంప్లెక్స్ కట్టేందుకు ప్రయత్నించగా గ్రామంలోని దళితులు అడ్డుకున్నారు. కేవలం మేమందరమూ కూర్చుంటున్నామనే కారణంతోనే దానిని కూల్చేశారు. అడ్డుకున్న మమ్మల్ని చంపుతామని బెదిరించారు. మేము చేసిన పోరాట ఫలితంగా అప్పటి కలెక్టర్ దానిని పబ్లిక్ పార్కుగా మలిచారు. ఇప్పుడు మళ్లీ నాలుగురోజుల క్రితం కొలతలు వేస్తుండగా మేము ప్రశ్నిస్తే కాంప్లెక్స్ వేసి తీరుతామని, మీకు దిక్కున్న చోట చెప్పుకోండంటూ బెదిరింపుగా సమాధానమిచ్చారు. అందువలన ఆ ప్రయత్నాన్ని అడ్డుకొని పార్కు పార్కుగానే ఉంచాలని కలెక్టర్‌ను కోరుతున్నాం.

– ఎస్సీ వర్గాలవారు, లగడపాడు గ్రామం



### ముగ్గురు మైనర్ల అదృశ్యం

చీరాల: మండలంలో ఒకే రోజు ముగ్గురు మైనర్లు అదృశ్యమయ్యారు. రూరల్ ఎస్ఐ జనార్దన్ తెలిపిన వివరాల మేరకు.. వాడరేవుకు చెందిన ఇద్దరు బాలికలు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు శనివారం ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికి చేరలేదు. కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో కేసులో కావూరివారిపాలేనికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని శనివారం రాత్రి ఇంట్లో భోజనం చేసి పడుకుంది. ఆదివారం ఉదయానికి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసులు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్ఐ జనార్దన్ తెలిపారు.

### ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మార్చి 2న వాక్ ఇన్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టుల ఫైనల్ మెరిట్ లిస్టు రూపొందించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు సోమవారం తెలిపారు. లిస్టుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తెలియజేయాలన్నారు. మెరిట్ లిస్టును guntur.ap.gov.in సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

## క్లుప్తంగా

### బ్యాంక్ ఖాతా నుంచి నగదు మాయం

కారెంపూడి: బ్యాంకు ఖాతా నుంచి రూ.45,693 మాయం అయిన ఘటన చోటుచేసుకుంది. ఈ మేరకు బాధితుడు స్థానిక ఎస్‌బీఐ శాఖ చీఫ్ మేనేజర్ కె.ఏడుకొండలుకు సోమవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలు.. విద్యుత్ శాఖ స్థానిక సెక్షన్ ఆఫీస్ పరిధిలోని చింతపల్లి గ్రామ అసిస్టెంట్ లైన్‌మెన్‌గా కె.కామేశ్వరరావు పనిచేస్తున్నాడు. ఖాతాలో ఏప్రిల్ నెలలో జమ అయిన జీతంలో ఐదు దఫాలుగా మొత్తం రూ.45,693 మాయం అయ్యాయని వివరించాడు. బ్యాంక్ ఖాతాకు లింక్ అయిన ఫోన్ నంబరుకు కూడా సమాచారం రాలేదని, డబ్బు డ్రా చేసుకుందామని బ్యాంక్‌కు వచ్చినప్పుడు నగదు మాయం విషయం తెల్సిందన్నారు. బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఈ విషయాన్ని పై అధికారులకు నివేదించారు. ఎఫ్1 టీఎక్స్‌ఎన్ సీఎస్‌పీ ఎఈపీఎస్‌ను ట్రాప్ చేయడంతో పాటు ఖాతాదారుని ఫోన్ నంబరును కూడా ట్రాప్ చేసి నగదును 4899472105213, 489948 9105214, 4899505105218 నంబర్లకు నగదును సైబర్ నేరగాళ్లు మళ్లించారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే స్థానిక ఎస్‌బీఐతో పాటు, యూనియన్ బ్యాంక్ ఖాతాదారుల ఖాతాల నుంచి ఇలా నగదు మాయం అవుతున్న ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికి కారెంపూడి మండలానికి చెందిన 16 మంది బ్యాంకు ఖాతాల నుంచి నగదు మాయం అయినట్లు సమాచారం. వారి ఫిర్యాదులను బ్యాంకు మేనేజర్లు స్వీకరించి పై అధికారులకు పంపుతున్నారు. దీనికి తక్షణ నివారణోపాయంగా తమ సెల్‌ఫోన్‌లో ఆధార్ నంబరును లాక్ చేసుకోవాలని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఏడుకొండలు ఖాతాదారులను సూచిస్తున్నారు. ఆధార్ నంబరును వినియోగించే సమయంలో బయోమెట్రిక్ వేసే సందర్భాలలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అందుకే సెల్‌ఫోన్‌లో తమ ఆధార్ నంబరును లాక్ చేసుకుని అవసరమైన సందర్భాలలోనే లాక్ తీసి వినియోగించుకోవాలని కోరుతున్నారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**జిల్లా కలెక్టర్ శివశంకర్**


మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, పక్కన జేసీ శ్యామ్‌ప్రసాద్, డీఆర్వో వినాయకం

నరసరావుపేట: జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో వెనుకబడిన పది మండలాలు పురోగతి సాధించే విధంగా అధికారులంతా పనిచేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుంచి ఆయా శాఖల స్పెషల్ ఆఫీసర్స్, వీడియో కాన్ఫరెన్సు ద్వారా మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో 28 మండలాలకు కేటాయించిన అధికారుల కమిటీలో అభివృద్ధి పనుల్లో వెనుకబడిన పది మండలాల అధికారులతో అనుసరించాల్సిన అంశాలపై మాట్లాడారు. ప్రభుత్వ పనుల్లో ఎక్కడా ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ కార్డులు అప్‌డేట్ వంద శాతం పూర్తిచేయాలని సూచించారు.

గ్రామ పంచాయతీలకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు, గ్రామాలను మ్యాపింగ్ చేసి పనులు జరిగేలా చూడాలని చెప్పారు. జిల్లాలో సుస్థిర అభివృద్ధి సాధించేందుకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకొని తప్పని సరిగా నిబంధనలను అనుసరించాలని కోరారు. ఐదేళ్లలోపు చిన్నారులకు త్వరితగతిన ఆధార్ అప్‌డేట్ చేసిన తర్వాత వచ్చిన ఆధార్ కార్డులను బాల్ ఆధార్ యాప్(బీఓపీ)లో అప్‌డేట్ చేయాలని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఓ.పి.పెంచాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ఎన్.సి.డి సర్వేలో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆ వివరాలను యాప్‌లో అప్‌డేట్ చేయాలని కోరారు. అన్నీ సచివాలయాల్లో తప్పనిసరిగా నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అందులో ఫ్యామిలీ డాక్టర్ వచ్చి వెళ్లే సమాచారం ఉండాలని వివరించారు. వెలుగు ఏపీఎంలు తప్పనిసరిగా ప్రతీ స్కూల్లో మధ్యాహ్నభోజనం తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, డీఆర్వో కె.వినాయకం పాల్గొన్నారు.

**పత్తి, మిరప విత్తనాలు అందజేయండి**

జిల్లాలో పత్తి, మిరప పంటల సాగుకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి, పంపిణీ దారులు సకాలంలో రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఖరీఫ్–23పై వాణిజ్య పంటలైన మిరప, పత్తి విత్తనాల ఉత్పత్తి, పంపిణీదారులతో సమీక్ష చేశారు. విత్తన సరఫరాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా నిర్ణీత ధరల్లో అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి బీజే బెన్నీ, ఏపీ సీడ్స్ మేనేజర్ సుబ్బయ్య పాల్గొన్నారు.

**దళిత గిరిజనులకు నిధులు**

దళిత గిరిజన బడ్జెట్ వాచ్ బుక్‌లెట్స్‌ను జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీద ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత గిరిజన బడ్జెట్ వాచ్ పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు మల్లెల చిన్నప్ప, మేడే వెంకట రమణ, గుండాల మణిక్యరావు పాల్గొన్నారు.

**నవోదయం ద్వారా సామగ్రి**

నవోదయం కింద షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తికి రూ.6 లక్షలు విలువ చేసే టెంట్‌హాలు సామగ్రిని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అందజేశారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాల్‌లో నిర్వహించిన సమావేశంలో నవోదయం పథకంలో (పీఎంఈజీపీ) ప్రధానమంత్రి ఉపాధికల్పన పథకం ద్వారా సుమారు రూ.6 లక్షల విలువ చేసే టెంట్‌హౌస్ వ్యాపారానికి రుణసౌకర్యం కల్పించారు. నరసరావుపేట మండలంలోని అర్వపల్లి గ్రామానికి చెందిన తలపల శ్రీనివాసరావు గతేడాది సెప్టెంబర్ 14న దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుడు షెడ్యూల్ తెగలకు చెందిన వారు కావడంతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని లబ్ధిదారునికి రుణసౌకర్యం కల్పించడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో సత్వరం రుణం మంజూరైందని నవోదయం నోడల్ అధికారి సంజీవరావు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

# నాకు న్యాయం చేయండి..

● కుమారుడి మృతికి కారకులపై చర్య తీసుకోండి ● ఎస్పీకి ఓ తండ్రి ఫిర్యాదు ● జగనన్నకు చెబుదాంలో 54 ఫిర్యాదులు స్వీకరణ



'ఫొటోలో కనిపిస్తోంది ఈదర సుబ్బారావు. కాకాని గ్రామం. కుమారుడు ఆర్మీలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందాడు. గత ఏడాది మే 29న ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే ఆ రోజున నేను వచ్చేసరికి మృతదేహం ప్రైవేటు హాస్పిటల్‌లో ఉంది. దీనికి నా కోడలు, ఆమె తమ్ముడే కారణం. ఇప్పటికైనా సరైన దర్యాప్తుచేసి నా కుమారుడి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయాలని' ఎస్పీని వేడుకున్నారు.


బాధితుడి నుంచి జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: జిల్లా పోలీస్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. 54 ఫిర్యాదులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధతో నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. తమ సమస్యలు విన్నవించుకునేందుకు విచ్చేసిన ప్రజలకు అదనపు ఎస్పీ(ఏఆర్) రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, అధికారులు స్వయంగా భోజనాలు వడ్డించారు. డీఎస్పీలు సి.విజయభాస్కరరావు, బి.ఆదినారాయణ, యు.రవిచంద్ర, జయరాం ప్రసాద్ పాల్గొన్నారు.

### గన్‌లైసెన్స్ ఇప్పించండి

నేను ఆర్మీలో 17ఏళ్ల పాటు పనిచేసి రెండేళ్ల క్రితం రిటైరయ్యాను. గన్ లైసెన్స్ కోసం అర్జీ పెట్టుకున్నా. ఆర్నెల్లు నుంచి పెండింగ్‌లో ఉంది. నాకు లైసెన్స్ మంజూరుచేస్తే ఎక్కడైనా చిరు ఉద్యోగం చేసుకుంటా. అందువలన గన్‌లైసెన్స్ మంజూరు చేసి నాకు న్యాయం చేయండి.

–పఠాన్ సైదా, రిటైర్డు ఆర్మీ ఉద్యోగి

### బంగారం ఇప్పించండి



నా ఆరోగ్యం బాగాలేక వైద్యసేవల నిమిత్తం ఏడు సవర్ల బంగారాన్ని ఓ బంగారం వ్యాపారి వద్ద కుదువ పెట్టి డబ్బులు తీసుకున్నా. డబ్బులు మొత్తం తిరిగి చెల్లించినా బంగారం వస్తువులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదు. నా బంగారం నాకు ఇప్పించండి.

–నూలు గోవిందరాజులు, దొండపాడు, వినుకొండ మండలం

### నాపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోండి



నా ఇంట్లో అద్దెకుంటున్న మహిళను ఖాళీ చేయమన్నందుకు ఆమెకు సంబంధించిన వ్యక్తులు నాపై దాడి చేశారు. బంగారం, డబ్బులు లాక్కున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదు. దాడిచేసిన వారిని అరెస్టుచేసి అద్దెకుంటున్న మహిళను ఖాళీ చేయించండి.

–పొట్లేళ్ల శాంతమ్మ, కారంపూడి

# దండా ప్రసాద్ సేవలు నిరుపమానం

**ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి**

కొరిటెపాడు(గుంటూరు): ప్రజాభిమానం చూరగొంటూ సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేసి పలువురి జీవితాల్లో వెలుగులు నింపిన పారిశ్రామికవేత్త దండా ప్రసాద్ ఆకస్మిక మరణం వేలాది మంది ప్రజల పాలిట పిడుగుపాటైందని ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లంకా రఘురామిరెడ్డి చెప్పారు. లక్ష్మీపురంలోని అసోసియేషన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలు నిర్వహిస్తున్నా ఆర్థిక బలం సమృద్ధిగా ఉన్నా మూలాలు మరువని ఉన్నత వ్యక్తి ప్రసాద్ అని కొనియాడారు. ప్రసాద్ తండ్రి బ్రహ్మానందం మాట్లాడుతూ మంగళవారం నాదెండ్ల మండలం, గిరిజవోలు గ్రామంలోని జ్యోతిర్మయి టెక్స్‌టైల్స్‌లో ఆవరణలో ప్రసాద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు సామినేని కోటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అల్పాహార నిధులు జమ చేస్తాం

**ఏపీటీఎఫ్ నేతల వినతిపై జెడ్పీ చైర్‌పర్సన్ హామీ**

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థుల అల్పాహారానికి సంబంధించిన నిధులను విడుదల చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాకు ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మొహమ్మద్ ఖాలీద్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం జెడ్పీ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్లో హెనీ క్రిస్టినాను కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు ఆమెకు వినతి పత్రం సమర్పించారు. ఆ మొత్తాన్ని సంబంధిత హెచ్‌ఎంల ఖాతాల్లో జమ చేసేందుకు కృషి చేస్తామని క్రిస్టినా హామీ ఇచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగశివన్నారాయణ, జిల్లా కార్యదర్శి కుంబా శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్ బి.కోటేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాస్ ఉన్నారు.

# అక్రమ మద్యం కలిగిఉన్న కంచేటి సాయి అరెస్ట్

క్రోసూరు: తెలంగాణ మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం రాత్రి వాహనాల తనిఖీ చేస్తుండగా కంచేటి సాయిబాబు వాహనంలో 20 బాటిళ్ల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని, సాయిబాబును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మణికృష్ణ సోమవారం తెలిపారు. రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

# ప్రైవేటు హాస్పిటల్‌కు నోటీసులు జారీ



నరసరావుపేట: మాతృమరణాల సమీక్షకు హాజరుకాని మాచర్ల చలమారెడ్డి హాస్పిటల్‌కు నోటీసు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి ఆదేశాలు జారీ చేశారు. స్థానిక కార్యాలయంలో మార్చిలో మాతృ, శిశు మరణాలపై సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. మార్చి నెలకు సంబంధించి కారంపూడి పీహెచ్‌సీ పరిధిలోని ఒక మాతృ మరణం, రెంటచింతల పీహెచ్‌సీ పరిధిలో ఒక శిశు మరణం, అలాగే సత్తెనపల్లి మండలం నిడుముక్కలలో ఒక శిశు మరణంపై కమిటీ సభ్యులు, ప్రైవేటు, ప్రభుత్వ వైద్యాధికారులు సమక్షంలో మరణాలకు గల కారణాలను, వాటిని అధిగమించేందుకు భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణ క్షుణ్ణంగా పరిశీలించి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. సమీక్షకు హాజరుకాని కారెంపూడి పీహెచ్‌సీలో చోటుచేసుకున్న మాతృమరణంపై హాజరుకాని చలమారెడ్డి హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ హాస్పిటళ్ల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, జిల్లా ఉప వైద్యశాఖాధికారి డాక్టర్ జి.చంద్రశేఖర్, కమిటీ సభ్యులు డాక్టర్లు మంత్రు నాయక్, పి.సింధుజ, వసంతరాయ్, నాగపద్మజ, హనుమకుమార్, బి సురేఖ, ఐసీడీఎస్ పీడీ అరుణ పాల్గొన్నారు.